క్లుప్తంగా

పక్కాగా ఎండీఏ సర్వే



పెదపెంకిలో సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

బలిజిపేట: బోదకాలు ఇంటింటి సర్వేను(ఎండీఏ) పక్కాగా చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి సూచించారు. పెంపెంకిలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె శుక్రవారం పర్యవేక్షించారు. సర్వేను కచ్చితంగా చేయాలని అన్నారు. డీఈసీ మాత్రలు, అల్బెండజోల్ మాత్రలు వేయించాలి తప్ప చేతికి ఇచ్చి వదిలి వేయరాదన్నారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ కార్మికుల జీతాల సమస్య పరిష్కరించాలి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులు

సాలూరు: సాలూరు ఆర్టీసీ డిపోలో అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాల సమస్యను పరిష్కరించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. సాలూరు ఆర్టీసీ డిపోలో అవుట్‌సోర్సింగ్ ద్వారా పని చేస్తున్న మెకానికల్, శ్రామిక్, స్లీపింగ్ తదితర విభాగాల్లో కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. వీరికి నాయుడు మద్దతు తెలిపి డిపో ఆవరణలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి నెలా జీతాలు 15వ తేదీ దాటిన తరువాత వేస్తున్నారని, జీతాలతో పాటు పీఎఫ్ జమ చేయడం లేదన్నారు. ఒక్కో కార్మికుడు వద్ద వెయ్యి రుపాయిల నుంచి 2 వేల వరకు తగ్గించి ఇస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ డీఎం భాస్కరరెడ్డికు కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు.

మిగులు జలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం టౌన్: వెంగళరాయ సాగర్ అదనపు ఆయకట్టు మిగులు జలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీతానగరం మండల నాయకులు కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతానగరం మండలంలోని కోట సీతారాంపురం, పూనుబుచ్చింపేట, జానుమల్లువలస, గాదెలవలస గ్రామాలకు బొబ్బిలి నియోజకవర్గంలో కలవరాయి, వాకాడవలస, అన్నంనాయుడు వలస గ్రామాలకు మిగులు జలాలు వచ్చేలా చూడాలనారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నీటి వినియోగదారుల సంఘ సభ్యులు ఉన్నారు.

నేటి నుంచి శివాలయం ప్రతిష్ఠ పూజలు



తాళ్లబురిడిలో ప్రతిష్ఠకు సిద్ధంగా వున్న శివాలయం

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం ప్రతిష్ఠ పూజలు శనివారం నుంచి ఈ నెల 17వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బలగ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గ్రామంలో గంగా, పరమేశ్వరుని శివాలయ ప్రతిష్ఠ పూజలను ఈ నెల 15 నుంచి 17వరకు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు, అభిషకాల పూజలను చిలకలపల్లికి చెందిన శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

సైబర్ మోసాలపై తస్మాత్..



మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజేష్

సీతానగరం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని ఎస్.సీతారాంపురంలో శుక్రవారం ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, వేధింపుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ మేరకు ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ బ్యాంక్‌ల్లో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. స్థానిక సర్పంచ్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య

- సొంతభూమి ఉన్నవారే అర్హులు
- సంక్షేమ పథకాల అమలుకు ఇదే ప్రామాణికం
- కొనసాగుతున్న ప్రక్రియ



నమోదు చేయిస్తున్న సిబ్బంది

బలిజిపేట:

ఆధార్ తరహాలో అన్నదాతకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగు భూమి ఉన్న ప్రతీ రైతుకు 14అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం జారీ చేసే ప్రక్రియను చేపట్టింది. భవిష్యత్‌లో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

నమోదుకు అవసరమైన ధ్రువ పత్రాలు

రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ లేదా వన్‌బీ, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబరు. వీటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చడం ద్వారా రైతు మొబైల్ నంబరుకు మూడుసార్లు ఓటీపీలు వస్తాయి. ఆ ఓటీపీలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి రైతు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తును పూర్తి చేయాలి.

ప్రయోజనాలు

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుంది.

పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలను నేరుగా పొందే వీలు కలుగుతుంది. సత్వర పరిహారం పొందేందుకు ఉపయోగ పడుతుంది. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి ఉపయోగపడుతుంది. వరి, వేరుశనగ, పత్తి, మిర్చి, మినుము, మొక్కజొన్నలతో పాటు కూరగాయలు, ఇతరత్రా ఎటువంటి పంటలను సాగు చేసినా, ఒక్క సెంటు వ్యవసాయ భూమి ఉన్నవారైనా.. ప్రతీ రైతుకు ఐడీ నంబరు అవసరం. మండలంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 21వేల ఎకరాలు, రబీలో 5వేల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. మొత్తం 9వేల మంది రైతులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు చేయించుకోవాలి

విశిష్ట సంఖ్యకు సంబంధించి ప్రతీ రైతు రైతుభరోసా కేంద్రాల వద్ద 14సంఖ్యల ఐడీ పొందాల్సి ఉంటుంది. భవిష్యత్‌లో ఎటువంటి పథకాలు అమలు కావాలన్నా ఇది తప్పనిసరి. ఎవరు నిర్లక్ష్యం, అశ్రద్ధ చేయకుండా తప్పకుండా ఈనెల 25వ తేదీ లోపల చేయించుకోవాలి.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో యూటీఎఫ్ నాయకులు

మక్కువ: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరీకి మద్దతుగా యూటీఎఫ్ మండల శాఖ శుక్రవారం విస్తృత ప్రచారం శుక్రవారం నిర్వహించింది. మండలంలోని వెంకటభైరిపురం, మక్కువ, ములక్కాయవలస మోడల్ పాఠశాల, కాశీపట్నం కేజీబీవీ పాఠశాల, ఎర్రసామంతవలస, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు, జిల్లా కార్యదర్శి మత్స శంకరరావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై పోరాటానికి మద్దతుగా ఉండాలని కోరారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి



మాట్లాడుతున్న అధికారులు

సాలూరు: రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించాలని సీఐ అప్పలనాయుడు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ సిబ్బంది, ఆటో యూనియన్ లీడర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మితిమీరిన వేగాలతో వాహనాలను నడపరాదని అన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. భద్రతా నియమాలపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం భాస్కరరెడ్డి, రోడ్‌సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ డా.పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: రహదారి భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాహన చోదకులు, ఆటోడ్రైవర్లతో ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతీ ఒక్క డ్రైవర్ ఈ–శర్మ పోర్టల్‌లో తమ యొక్క పేరు, ఇతర వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, ఆర్టీసీ డ్రైవర్లు, ఆటోడ్రైవర్‌లు పాల్గొన్నారు.

కాశీపేటలో సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి కరుణాకర్

సీతానగరం: మండలంలోని కాశీపేటలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి కరుణాకర్ అన్నారు. గ్రామ సందర్శనలో భాగంగా శుక్రవారం కాశీపేటలో ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అధ్యక్షతన మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి కరుణాకర్‌తో కలిసి మండల స్థాయి అధికారులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ప్రభుత్వానికి నివేదించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమరావు, హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు, ఏపీఓ భాను, ఏపీఎం ఆర్.శ్రీరాములు, ఐసీడీఎస్ సూపరువైజరు పూర్ణిమ, ఎంఈఓ జి.సూరిదేముడు, సర్పంచ్ ధనంజయమ్మ, వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో గోశాలల నిర్మాణం



మూడడ్ల వలసలో ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడుతున్న గోశాలలు

పార్వతీపురం రూరల్: పాడి పశువుల అభివృద్ధికి పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం గోశాలలను మంజూరు చేసింది. గోశాలలను పాడి రైతుల సొంత స్థలాల్లోనే నిర్మాణం చేయాల్సి వుంది. అయితే కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో గోశాలలను నిర్మాణం చేపట్టి నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గోశాలలను నిర్మిస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని సూడిగాం పంచాయతీ మూడడ్లవలసలో టీడీపీ నాయకులు అండదండతో ప్రభుత్వ స్థలంలో గోశాలలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం గోశాలలను నిర్మిస్తున్న పరిసరాల్లోనే అంగన్‌వాడీ కేంద్రం, రక్షిత మంచినీటి పథకం తదితర ప్రభుత్వ నిర్మాణాలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాల విషయం రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నప్పటికీ చర్యలు కానరావడం లేదు. అధికారులు ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న గోశాలల నిర్మాణంపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భూమి పూజ



దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ చేస్తున్న కాళిదాసు శర్మ

పార్వతీపురం: పట్టణంలోని శ్రీ విద్యా సర్వమంగళా దేవి పీఠం ప్రాంగణంలో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించి భూమి పూజ కార్యక్రమాన్ని శ్రీ విద్యా సర్వమంగళ పీఠాధిపతి, ప్రముఖ నాడీ జ్యోతిష్యులు మురపాక కాళిదాసు శర్మ నిర్వహించారు. శుక్రవారం ఉదయం 18 అడుగుల దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించి భూమి పూజను నిర్వహించారు. లోక కళ్యాణార్థం నిత్య యజ్ఞ యాగాదులు నిర్వహించేందుకు అనుగుణంగా దక్షిణామూర్తి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ భగవద్గీత ఉపాసకులు కంచుమోజు రామ్మోహనరావు, గాయత్రి ఉపాసకులు జల్లు బాబ్జీ, అయ్యప్ప స్వామి సేవకులు సీతారామ స్వామి, శ్రీ విశ్వకర్మ సేవాసంఘం సభ్యులు బురగాన రంగ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము రికవరీపై విచారణ

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల గ్రామానికి చెందిన అనర్హులైన ఏడుగురు వ్యక్తులు 2018 – 19 కాలంలో పింఛన్లు తీసుకున్నారని లోకాయుక్తకు అందిన ఫిర్యాదుతో పలుమార్లు విచారణ చేపట్టిన అధికారులు తాజాగా పింఛన్ సొమ్ము రికవరీ చేసేందుకు శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణాధికారిగా వచ్చిన పాలకొండ డీఎల్‌డీఓ వి.గోపాలకృష్ణ, ఎంపీడీఓ బి.వెంకటరమణ సంబంధిత పంచాయతీ కార్యదర్శులను పిలిపించి వివరాలు సేకరించారు. అయితే గతంలో మంజూరు చేసిన పింఛన్ల వివరాల ఫైల్స్ లేవని అధికారులు చెప్పడంతో అధికారుల తీరుపై విచారణాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు తెలియజేయాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని గోపాలకృష్ణ హెచ్చరించారు.

ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

గత టీడీపీ పాలనలో 2018 – 19 మధ్య కాలంలో గ్రామానికి చెందిన ఎస్.లచ్చిశెట్టి (11 నెలలు), గంట రాము (11 నెలలు), బోను అప్పయ్య (21 నెలలు), కొమరాపు పోతయ్య (21 నెలలు), బి.లక్ష్మం (21 నెలలు), వై.వెంకయ్య (19 నెలలు), కె.సీతమ్మ (14 నెలలు) వృద్ధాప్య పింఛన్ల రూపంలో 2,12,750 రూపాయలు తీసుకున్నారు. వీరంతా అనర్హులని గ్రామానికి చెందిన యామక అప్పలనాయుడు అప్పట్లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై పలుమార్లు అధికారులు విచారణ చేపట్టి, 2019 డిసెంబర్‌లో వీరికి వస్తున్న పింఛన్లను నిలిపివేశారు. వీరి నుంచి నగదు రికవరీ చేయాలని గతేడాది ఆగస్టులో లోకాయుక్త నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు తాజాగా విచారణ చేపట్టారు.

ఉపాధి పనులు సామాజికాభివృద్ధికి దోహదపడాలి



వెన్నెల బుచ్చింపేటలో పనుల పరిశీలన

సీతానగరం:

గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో భాగంగా వెన్నెల బుచ్చింపేట, వెంకటాపురం గ్రామాల్లో ఉపాధి పనులు సామాజిక పరమైన అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. వెన్నెల బుచ్చింపేట మామిడి తోటలో నిర్మాణం జరుగుతున్న ఫారం పాండ్స్ పనులు, వనసేవక్ పి.చంటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని శుక్రవారం ఆయన పరిశీలించారు. అంటిపేట పంచాయతీ వెన్నెల బుచ్చింపేట, వెంకటాపురం గ్రామాల్లో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు.

నర్సరీలో ఫలజాతి, ఫలసాయం తదితర రకాల పెంపకం జరుగుతున్న మొక్కలు వర్షాలు కురుస్తున్న సమయాన్ని గుర్తించి లేదా నీటి వనరులున్న పొలాల్లో మొక్కలను నాటాలన్నారు. మేట్‌ల సంఖ్య పెరుగుతున్నందున వేతనదారులకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

• కానరాని స్వచ్ఛత



పార్వతీపురం పట్టణంలోని కాలువలు శిథిలావస్థకు చేరుకోగా...పూడికలు పేరుకుపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపించి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బారిన పడి అవస్థలు పడుతున్నారు. స్వచ్ఛ సంకల్పం కేవలం ఫొటోలకే పరిమితమైందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

– పార్వతీపురం టౌన్

• ఆదాయం సమకూర్చుకోవాలి..



పంచాయతీలు ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని డీఎల్‌డీఓ ఎస్.రమేష్‌రామన్ అన్నారు. పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామ సందర్శనలో భాగంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. చెత్తను సేకరించి సేంద్రీయ ఎరువుగా తయారు చేసి విక్రయించి పంచాయతీలకు ఆదాయం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

– పార్వతీపురం రూరల్

• పోస్టల్ జీడీఎస్ ఉద్యోగుల ఆందోళన



పోస్టల్ జీడీఎస్‌లకు 8వ పే కమిషన్ అమలు చేయాలని పోస్టల్ పీజేసీఏ యూనియన్ నాయకులు జె.రవీంద్రనాథ్ అన్నారు. పార్వతీపురం హెడ్ పోస్టాఫీసు వద్ద ఉద్యోగులతో కలిసి శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు అనుకూలమైన కమలేష్ చంద్ర కమిటీలోని సానుకూల అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. ఐసీడీ, సీడీసీ ప్రపోజల్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో తాడ్డి వేణుగోపాలరావు, బి.ఉమాశంకర్, ఎం.అప్పారావు, గౌరీశంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్

కొటియా గ్రామాల గిరిజనులకు రక్షణ కరువు



సమస్యలు పరిష్కరించాలని మంత్రి సంధ్యారాణిని కోరుతున్న కొటియా గ్రామాల గిరిజనులు

సాలూరు: ఆంధ్రా – ఒడిశా వివాదస్పద కొటియా గ్రూపు గ్రామాల గిరిజనులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని ఆ గ్రామాల గిరిజనులు, నాయకులు కోరారు. మంత్రి ఇంటి వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తమ సమస్యలపై కొటియా గ్రామాల గిరిజనులు విన్నవించారు. ఇటీవల కాలంలో ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యం చేస్తూ దాడి చేస్తుందని, ఆంధ్రా ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని వాపోయారు.

గిరిజన రక్షణ చట్టాలను లెక్క చేయకుండా ఒడిశా ప్రభుత్వం తమను ఇబ్బంది పెడుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొటియా గ్రామాల సమస్యకు పరిష్కారం చూపి, గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు.

ఉపాధి పనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఉపాధి పనుల వద్ద మాట్లాడుతున్న మన్మధరావు

బలిజిపేట: ఉపాధి పనుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు డిమాండ్ చేశారు. వంతరాంలో ఉపాధి పనుల వద్ద వేతనదారులతో శుక్రవారం మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌తో ఉపాధి కూలీలకు నరకం చూపిస్తుందన్నారు. రెండు పూటలా పనులు పెట్టడం వల్ల వేతనదారులకు చెందిన వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నారని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా రూ.600 గిట్టుబాటు అయ్యే విధంగా చూడాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీటి సదుపాయాలు కల్పించాలన్నారు. వేతనదారులు పాల్గొన్నారు.